# సాక్షి వికారాబాద్

గురువారం ౹ 26 ౹ అక్టోబర్ ౹ 2023




**అగ్రతాంబూలం**

ఉమ్మడి ఏపీ, తెలంగాణ రాజకీయాల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. 10లో▸



**ముడుపులతో గాలం!**

తాండూరు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులే టార్గెట్‌గా కాంగ్రెస్ పార్టీ గాలం వేస్తోంది. 10లో▸





**మరోసారి ఆశీర్వదించండి**

తనను మరోసారి ఆశీర్వదించాలని వికారాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి.. ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు. 11లో▸

## దారికొస్తారా?



### బీఆర్ఎస్ అసంతృప్త నేతలతో ఎంపీ మంతనాలు

- సయోధ్య కుదిర్చేందుకు మధ్యవర్తిత్వం
- కేటీఆర్ సమక్షంలో చర్చలు
- ఇంకా అలక వీడని కొందరు నేతలు
- ఇరు వర్గాలకు కేటీఆర్ క్లాస్
- అక్కడ ఒప్పుకొని.. ఇక్కడ అంటీముట్టనట్లుగానే..

**వికారాబాద్:** అసంతృప్త నేతలను బుజ్జగించేందుకు అధికార పార్టీ చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీలో అంతర్గత కలహాలు మంచిది కాదని భావించి ముఖ్య నేతలు అసంతృప్త నేతలు అలక వీడేలా ప్రయత్నాలు మొదలు పెట్టారు. గతంలో పలు సార్లు బుజ్జగింపులు కొనసాగగా ఈ సారి మరింత సీరియస్‌గా తీసుకున్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి వారంలో రోజులుగా అసంతృప్తి నేతలను దారిలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ముందుగా అలకబూనిన నేతలందరినీ కలుస్తున్నారు. ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడుతున్నారు. ఇదే సమయంలో వారందరిని వెంటబెట్టుకుని మంత్రి కేటీఆర్ వద్దకు వెళుతున్నారు. వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్‌ను సైతం అక్కడికి పిలిపించి సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేశారు. ఈ ఆపరేషన్ మొత్తం ఎంపీ రంజిత్‌రెడ్డి దగ్గరుండి చేపడుతున్నారు.

**ఇరు వర్గాలకు కేటీఆర్ క్లాస్**

వికారాబాద్ అసంతృప్త నేతల పంచాయితీ ఇప్పటికే పలు సార్లు మంత్రులు సబితారెడ్డి, కేటీఆర్ వద్దకు వెళ్లిన విషయం తెలిసిందే. అప్పట్లో ఎన్నికలకు సమయం ఉండటంతో అధిష్టానం కూడా అంత సీరియస్‌గా తీసుకోలేదు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో అధిష్టానం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఎక్కువ శాతం మందికి పార్టీ మీద అభిమానం ఉన్నా స్థానిక ఎమ్మెల్యేపై అసంతృప్తి ఉన్నట్లు తేలడంతో ఎంపీ ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. వికారాబాద్, చేవెళ్ల నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి నేతలు అలకబూనడానికి గల కారణాలను కేటీఆర్‌కు వివరించినట్లు తెలుస్తోంది. అనంతరం అసంతృప్తులను ఎమ్మెల్యేను మంత్రి వద్దకు తీసుకువెళ్లారు. అయితే కేటీఆర్ మీ అందరిని మేం చూసుకుంటాం అని భరోసా ఇస్తూనే ఎన్నికల సమయంలో ఈ పంచాయితీ ఏంటని.. పార్టీ కోసం అందరు కలసికట్టుగా పని చేసి అభ్యర్థిని గెలిపించుకోవాలని సున్నితంగా మందలించినట్లు సమాచారం. ఇదే సమయంలో వారందరిని కలుపుకెళ్లాలని ఎమ్మెల్యేకు కూడా గట్టిగా చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.

**అక్కడ సై.. ఇక్కడ నై..**

ప్రధానంగా వికారాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు అసంతృప్తులు ఎక్కువగానే ఉన్నారు. వారిలో కొందరు ఇటీవల బీఆర్ఎస్ వీడి హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. పార్టీకి విధేయులుగా ఉంటూనే స్థానిక ఎమ్మెల్యే విషయంలో అసంతృప్తితో ఉన్న నేతలను ఇటీవల కేటీఆర్ పిలిపించుకుని మాట్లాడారు. కొంతమందికి మంత్రి నుంచి పిలుపువచ్చినా వెళ్లలేదని తెలిసింది. అయితే ఎమ్మెల్యేతో అంటీముట్టనట్లు ఉంటున్న వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులను కేటీఆర్ పిలవకపోవడం కూడా ఇటీవల చర్చకు దారితీసింది. అయితే కేటీఆర్ సమక్షంలో కొందరు నేతలు పార్టీ కోసం పని చేస్తామని తల ఊపి, ఇక్కడికి వచ్చిన తరువాత ఎమ్మెల్యేతో అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు.



ఆరు గ్యారంటీలపై ఇంటింట ప్రచారం చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి తదితరులు

## పథకాలన్నీ బీఆర్ఎస్ నేతలకే

- పేదలకు సీఎం కేసీఆర్ చేసిందేమీ లేదు
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా

**పరిగి:** బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకే దక్కా యని, అర్హులైన పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం పరిగి పట్టణంలోని శ్రీనివాస్‌నగర్, ప్రేమ్‌నగర్ కాలనీల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయుత పథకాలను అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్నారు. రెండు లక్షల రైతు రుణ మాఫీ అమలవుతుందని తెలిపారు. సీఎం కేసీఆర్ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని ఆరోపించారు. హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పథకాలు ఆగిపోతాయని బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తోందని, వారి మాటలు నమ్మవద్దని సూచించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం మండలంలోని నర్సయ్యగూడ, చౌడాపూర్ మండలం మందిపాల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాస్, జిల్లా నాయకుడు సాయిముదిరాజ్, నాయకులు ఎజాజ్, రియాజ్, చిన్న నర్సింహులు, పాలాద్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### న్యూస్‌రీల్

**నిబంధనలకు లోబడే డబ్బు తీసుకెళ్లాలి**

- రూ. 50 వేలకు మించితే సీజ్ చేస్తాం
- కలెక్టర్ నారాయణరెడ్డి

**వికారాబాద్ అర్బన్:** ఎన్నికల నిబంధనలకు లోబడే డబ్బు తీసుకెళ్లాలని కలెక్టర్ నారాయణ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఒక వ్యక్తి, సంస్థ గాని రూ. 50 వేలకు మించి నగదు, ఆభరణాలు తరలించాల్సి వస్తే అందుకు సంబంధించిన రసీదులు ఉండాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీల్లో 44మంది నుంచి రూ. 1,02,24,180 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నగదు తరలింపునకు ఆధారాలు ఉంటే తిరిగి పొందడానికి జిల్లా కో–ఆపరేటీవ్ అధికారి శంకరాచారిని సంప్రదించాలని తెలిపారు. రూ. 10 లక్షలకు మించి పట్టుబడితే ఆదాయపు పన్ను అధికారులకు సమాచారం ఇస్తామని తెలిపారు. నగదుకు సంబంధించిన రసీదులు ఉంటే సెల్ నంబర్ 8886911888లో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

**ఆనంద్‌కు అండగా నిలవండి**

ఎమ్మెల్యే సతీమణి సబితఆనంద్ పట్లూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం



పట్లూర్ గ్రామంలో ప్రచారం చేస్తున్న సబిత, బీఆర్ఎస్ నాయకులు

**మర్పల్లి:** వికారాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే ఆనంద్‌ను మరోసారి ఆశీర్వదించాలని ఆయన సతీమణి సబితఆనంద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని పట్లూర్ గ్రామంలో సర్పంచ్ ఇందిర, జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డితో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ఆనంద్‌కు ఓటు వేయాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రజల ఆమోదం పొందిందని పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ ఇందిర మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే ఆనంద్ ఎంతో కృషి చేశారని, ఆయన్ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**రూ.2.83 లక్షల పట్టివేత**



స్వాధీనం చేసుకున్న నగదుతో ఎస్‌ఐ సత్యనారాయణ

**పరిగి:** మండలంలోని రాఘవాపూర్ చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో నగదు పట్టుబడింది. పరిగి నుంచి నగరానికి వెళ్తున్న యాదగిరి కారులో రూ. 1,50,000, యాదిరెడ్డి కారులో రూ 1,33,500 లభించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో తహసీల్దార్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నగదు తరలించే సమయంలో రసీదు, లేదా పత్రాలు తమ వెంట తెచ్చుకోవాలని ఎస్‌ఐ సూచించారు.

**ఈవీఎంలు.. ఆగయా**

**ఇబ్రహీంపట్నం:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి సంబంధించి బుధవారం ఈవీఎం బాక్సులు పోచారం సమీపంలోని సీవీఆర్ కళాశాలకు చేరుకున్నాయి. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 319 పోలింగ్ కేంద్రాలకు గాను 396 ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, 446 వీవీపీఏటీలు వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ అనంతరెడ్డి తెలిపారు. సీవీఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో ఈ యంత్రాలను భద్రపరిచినట్లు ఆయన తెలిపారు. పోలింగ్ కేంద్రాల కంటే అదనంగా మెషీన్లు, వీవీపీఏటీలు వచ్చినట్లు వెల్లడించారు. నవంబర్ 30న జరిగే పోలింగ్‌కు సీవీఆర్ కళాశాల నుంచి ఈవీఎంలను, సిబ్బందిని పంపుతామని.. తిరిగి పోలింగ్ అనంతరం ఇక్కడే ఈవీఎంలను భద్రపరుస్తామన్నారు. ఎన్నికల కౌటింగ్ కూడా ఈ కళాశాలలోనే జరుగుతుందని ఆయన వెల్లడిఇంచారు.



సీవీఆర్ కళాశాలలో ఈవీఎం బాక్సులు

## సంపద సృష్టించాం ప్రజలకు పంచాం

- మంత్రి మహేందర్ రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి
- మహేశ్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని విజ్ఞప్తి
- దోమలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

**దోమ:** సీఎం కేసీఆర్ సంపద సృష్టించి ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్నారని మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం దోమ మండల కేంద్రంలోని శ్రీ సాయి గణేశ్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు నేరుగా అందేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. బంగారు తెలంగాణే లక్ష్యంగా రైతు బంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, బీసీ బంధు, దళిత బంధు, మైనార్టీ బంధు, ఆసరా పింఛన్లు అమలు చేస్తున్నట్లు చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో అక్కడి ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తెలంగాణలో తప్ప దేశంలో ఎక్కడా వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అమలు కావడం లేదన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాకు సాగునీరు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రజల ఆదరణ పొందిందని పేర్కొన్నారు. అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకొనే సీఎం కేసీఆర్ మేనిఫెస్టో రూపొందించారని తెలిపారు. కార్యకర్తలు 36 రోజుల పాటు కలసికట్టుగా పని చేసి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. సీఎం కేసీఆర్ వచ్చాకే తెలంగాణ అభివృద్ధి సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి, జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, కో ఆప్షన్ సభ్యుడు ఖాజాపాష, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌కుమార్, మాజీ ఎంపీపీ రాజగోపాల్‌చారి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య ముదిరాజ్, బీఆర్ఎస్ పరిగి, దోమ మండల అధ్యక్షులు ఆర్ ఆంజనేయులు, గోపాల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, యూత్ విభాగం మండల అధ్యక్షుడు మశ్చేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి ప్రతిమారెడ్డి, బొంపల్లి ఎంపీటీసీ రాములు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

## కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోవద్దు



కొడంగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కర్ణాటక వాసులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

- కొడంగల్‌లో కర్ణాటక వాసుల ర్యాలీ
- అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు
- పోలీసుల తీరుపై నిరసన
- అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు

**కొడంగల్:** కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోవద్దని కర్ణాటక రాష్ట్రం సేడం, ముదేల్, రెబ్బన్‌పల్లి, మెతుక్కు, సిలార్ కోట్రికే, నాడేపల్లి, పాకాల, కొంతన్‌పల్లి, తౌలుమామిడి, కంద్రెపల్లి, చందాపూర్ గ్రామాలకు చెందిన పలువురు బుధవారం కొడంగల్‌లో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని బాలాజీనగర్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి వినాయక చౌరస్తా మీదుగా మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీలు అమలు కావడం లేదని ఆరోపించారు. ఉచిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కర్ణాటక ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం అని బస్సుల సంఖ్య తగ్గించారని ఆరోపించారు. గృహజ్యోతి పేరుతో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీ ఇచ్చారని, 200 యూనిట్లు దాటిన వారికి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఏడు గంటలు కరెంటు ఇస్తామని చెప్పి మూడు గంటలు కూడా ఇవ్వడం లేదన్నారు. గృహలక్ష్మి పేరుతో మహిళలకు నెలకు రూ.2 వేలు ఇస్తామని చెప్పి గెలిచిన తర్వాత ఒక నెల మాత్రమే డబ్బులు వేశారని అన్నారు. యువనిధి పథకాన్ని అమలు చేయలేదని వాపోయారు. నెలకు 10కిలోల బియ్యం ఉచితంగా ఇస్తామని చెప్పి అమలు చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే 5 కిలోల బియ్యం మాత్రమే ఇస్తున్నారని తెలిపారు

**అడ్డుకున్న కాంగ్రెస్ నేతలు**

కర్ణాటక వాసుల ర్యాలీ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనను అడ్డుకున్నారు. ప్రజల చేతుల్లో ఉన్న ప్ల కార్డులను చింపివేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకొని స్టేషన్ తరలించారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. జాతీయ రహదారి, అంబేడ్కర్ చౌరస్తాలో ఆందోళనకు దిగారు. కర్ణాటక వాసుల ఊరేగింపునకు అనుమతి లేకున్నా పోలీసులు సహకరించారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. పోలీసుల తీరుపై అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఫిర్యాదు చేశారు. తాము ఎవరికి అనుమతి ఇవ్వలేదని ఆయన చెప్పినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పోలీసుల తీరుకు నిరసనగా అంబేడ్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐ రాములు ఆందోళనకారులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కర్ణాటక నుంచి వచ్చిన వారి వివరాలు తెలుసుకొని కేసులు నమోదు చేస్తామని సీఐ హామీ ఇచ్చారు. దీంతో కాంగ్రెస్ నాయకులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, నాయకులు నయీమ్, సోమశేఖర్, దాము, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించాలి



కంకణాలపల్లి సభలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

- కేసీఆర్ పచ్చి మోసకారి
- రాష్ట్రంలో మళ్లీ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన తెస్తాం
- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

**బంట్వారం:** రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని చిత్తుగా ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన కోట్‌పల్లి మండలం మల్‌శెట్టిపల్లి, కంకణాలపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ను మించిన మోసకారి దేశంలో ఎక్కడా లేరన్నారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. మాయమాటలతో మోసం చేసేందుకు ఆ పార్టీ నేతలు గ్రామాల్లోకి వస్తారని, వారిని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. తొమ్మిదేళ్ల పాలనలో కల్వకుంట్ల కుటుంబం ఎక్కడికక్కడ దోచుకుని తెలంగాణను అధోగతిపాలు చేసిందని ఆరోపించారు. ధనిక రాష్ట్రం అయిన తెలంగాణ నేడు ఐదు లక్షల కోట్ల అప్పుల్లో ఉందన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించి తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకుందామని అన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో తన హయాంలో జరిగిన అభివృద్ధి తప్పా బీఆర్ఎస్ ఎమ్మెల్యే చేసిందేమీ లేదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోతో పాటు 6 గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలనను మళ్లీ తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ వహీద్, కంకణాలపల్లి మాజీ సర్పంచ్ సురేందర్, మాజీ జెడ్పీటీసీ అంజయ్య, బార్వాద్ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, రాము నాయక్, రమేష్ నాయక్, అక్బర్, ప్రభాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, మాధవ్, రాంచంద్రారెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, శ్రీనివాస్, శశికుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

## దమ్ముంటే నాపై గెలువు

- రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సవాల్
- కేసీఆర్‌పై పోటీ చేసే స్థాయి నీది కాదని హితవు
- కొడంగల్‌లో 30వేల మెజారిటీతో విజయం సాధిస్తానని ధీమా

**కొడంగల్:** రేవంత్‌రెడ్డికి దమ్ముంటే తనపై గెలవాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. కేసీఆర్‌పై పోటీచేసే స్థాయి రేవంత్‌కు లేదని హితవు పలికారు. బుధవారం పట్టణంలోని మంజునాథ ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. కొడంగల్ అసెంబ్లీ ఎన్నికల్లో తాను 30వేల మెజారిటీతో గెలుస్తానని చెప్పారు. 2018లో నా చేతిలో ఓడి మల్కాజిగిరి పారి పోయిన రేవంత్‌కు మళ్లీ ఓటమి తప్పదని హెచ్చరించారు. ఐదేళ్ల నుంచి రేవంత్‌కు కొడంగల్ గుర్తుకు రాలేదని, కరోనా కష్టకాలంలో ఇక్కడి ప్రజలను పట్టించుకోలేదని ఆరోపించారు. డబ్బులు ఇచ్చి పీసీసీ పదవిని కొనుక్కున్నాడని, ఎమ్మెల్యే టికెట్లు అమ్ముకునే చరిత్ర రేవంత్‌రెడ్డిదని అన్నారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారని ఆరోపించారు. 2009లో హస్నాబాద్‌లో గొడవలు సృష్టించి గెలిచారని, 2014లో గురునాథ్‌రెడ్డి, విఠల్‌రావ్‌లు ఇద్దరూ పోటీ చేయడం వల్ల రేవంత్ గెలిచారని అన్నారు. కేటీఆర్ కొడంగల్‌ను దత్తత తీసుకోవడంతో అధిక మొత్తంలో నిధులు వచ్చా యన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్, నాయకులు రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, భీములు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### దాడి ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు

నవాబుపేట: అకారణంగా పాత కక్షలు మనసులో పెట్టుకొని ఒకరిపై దాడి చేసి, గాయపరిచిన సంఘటన గంగ్యాడ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగ్యాడ గ్రామానికి చెందిన భానురి ఉపేందర్ రెడ్డి మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో శంకర్‌పల్లి నుంచి గంగ్యాడ గ్రామంలోని తన ఫామ్ హౌస్‌కు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన సిహెచ్ మల్లేశం, వంశీ, నారాయణ, అనిల్, మహేశ్, రామ్ రెడ్డి, వికాస్ రెడ్డిలు వాళ్లు తెచ్చుకున్న కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం అక్కడి నుంచి వారు పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ భరత్ భూషణ్ వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### బైక్ అదుపు తప్పి..

#### మహిళ మృతి


మృతురాలు జగ్గమ్మ

బంట్వారం: బైక్ అదుపు తప్పి భార్యకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం బంట్వారం-సల్బత్తాపూర్ రోడ్డు మార్గంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్వాపూర్ గ్రామానికి చెందిన జగ్గమ్మ (24) మూడు నెలల గర్భిణీ. భర్త ప్రకాశ్ తన బైక్‌పై జగ్గమ్మను బంట్వారం ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించేందుకు తీసుకుకెళ్తున్నాడు. మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి గుంతలో పడిపోవడంతో జగ్గమ్మకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రకాశ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతురాలి అత్త రాములమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

### రెండు బైక్‌లు ఢీ

- ఒకరు మృతి, ఇద్దరి పరిస్థితి విషమం
- గండిచెరువు సమీపంలో ఘటన


మృతుడు శ్రీను


కుల్కచర్ల: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని గండిచెరువు సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోరిగడ్డ తండాకు చెందిన జయ, శ్రీనివాస్(30)లు తన బైక్‌పై చౌడాపూర్‌కు వెళ్తుండగా గుబ్బడితండాకు చెందిన బాలు తన బైక్‌పై కుల్కచర్ల వైపు వస్తుండగా గండిచెరువు సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో శ్రీను, జయకు తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం మహబుబ్‌నగర్‌కు తరలిస్తుండగా శ్రీను మార్గమధ్యలో మృతి చెందాడు. జయ, బాలుకు తలకు, ఇతర భాగాల్లో తీవ్రగాయాలు కావడంతో వారి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు.

### వివాహిత ఆత్మహత్య

ధారూరు: అత్తింటి నుంచి అద్దె ఇంటికి మారిన కోడలు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ధారూరు మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలంలోని గొట్లపల్లి గ్రామానికి చెందిన వీరమణిని ధారూరు గ్రామానికి చెందిన లాలు వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు. అత్తా, కోడళ్లకు సఖ్యత సరిగ్గా లేకపోవడంతో అత్తగారి ఇంట్లో ఉంటున్న ఆమె భర్తతో కలిసి ధారూరులోనే అద్దె ఇంట్లో ఉంటోంది. భర్త కారు డ్రైవర్ కావడంతో రోజు మాదిరిగా వృత్తి పరంగా కారు తీసుకొని వెళ్లిపోయాడు. తన ఇద్దరు పిల్లలను బయట ఆడుకోమని బయటకు పంపి తలుపులు వేసుకుని ఫ్యాన్ బిగించడానికి ఏర్పాటు చేసిన ఇనుప ఉక్కుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సంతోష్‌కుమార్ సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంలో ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్ఐ చెప్పారు.



# అగ్రతాంబూలం..




## ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నేతలకు ప్రత్యేక గుర్తింపు

- ప్రతి కేబినెట్‌లోనూ మంత్రి పదవులు
- ఇప్పటి వరకు ఇద్దరు సీఎంలు, ముగ్గురు హోంమినిస్టర్లు మనవారే
- తొలి హోంమంత్రిగా రికార్డులకెక్కిన సబితారెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఉమ్మడి ఏపీ, తెలంగాణ రాజకీయాల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. అనేకమంది ఉద్దండులకు నిలయంగా ఈ జిల్లా నిలిచింది. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన బూర్గుల రామకృష్ణారావు షాద్‌నగర్ (ఒకప్పుడు మహబూబ్ నగర్ జిల్లా, ఇప్పుడు రంగారెడ్డి జిల్లాలో భాగం) నియోజకవర్గం నుంచే గెలుపొందారు. ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా పనిచేసిన మర్రి చెన్నారెడ్డి కూడా ఉమ్మడి జిల్లాలోని వికారాబాద్ నుంచి ఒకసారి, మేడ్చల్ నుంచి మరోసారి గెలుపొందారు. కేంద్రమంత్రిగా పనిచేసిన దివంగత నేత సూదిని జైపాల్‌రెడ్డి కూడా ప్రస్తుత రంగారెడ్డి జిల్లా పరిధిలోని కల్వకుర్తి నియోజకవర్గం నుంచి 4 సార్లు గెలుపొందారు. టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ తొలిసారిగా ఓటమిని చవిచూసింది ఇక్కడే. ఆయనపై గెలుపొందిన చిత్తరంజన్‌దాస్ చెన్నారెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు.

### పరిగి నియోజకవర్గం..

పరిగి నియోజకవర్గానికి ఇప్పటివరకు 15సార్లు ఎన్నికలు జరిగగా.. 12 మంది రెడ్డి సామాజిక వర్గం వారే విజయం సాధించారు. మూడుసార్లు మైనార్టీ(ముస్లిం) అభ్యర్థులు గెలుపొందారు. 1967లో స్వతంత్ర అభ్యర్థిగా కమతం రామిరెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత 1972, 1989లో ఆయనే కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. జలగం వెంగళరావు, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కేబినెట్లో.. కమతం రాంరెడ్డి వివిధ శాఖలకు మంత్రిగా పనిచేశారు. 1978, 1983లో పరిగిలో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన ఎ.షరీఫ్ చెన్నారెడ్డి, టంగుటూరి అంజయ్య కేబినెట్లలో మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత టీడీపీ నుంచి ఐదుసార్లు(1985, 1994, 1999, 2004, 2009) గెలుపొందిన హరీశ్వర్‌రెడ్డి డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆయన కొడుకు కొప్పుల మహేశ్‌రెడ్డి పరిగి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

### మేడ్చల్ నియోజకవర్గం..

మేడ్చల్ నియోజకవర్గానికి ఇప్పటివరకు 14 సార్లు ఎన్నికలు నిర్వహించగా పది మంది ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. వీరిలో ఒకరు ముఖ్యమంత్రిగా.. మరో ఐదుగురు మంత్రులుగా పనిచేశారు. వీరిలో సుమిత్రాదేవి (1967–72) జిల్లా నుంచి తొలి మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత మర్రిచెన్నారెడ్డి 1978లో కాంగ్రెస్ నుంచి గెలుపొంది ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన మొత్తం ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. వికారాబాద్, తాండూరు నుంచి రెండేసి సార్లు, సనత్‌నగర్ నుంచి ఒకసారి, మేడ్చల్ నుంచి ఒకసారి విజయం సాధించారు. ఆ తర్వాత ఉమా వెంకట్రామిరెడ్డి(1983, 1989) కాంగ్రెస్ నుంచి, సురేందర్‌రెడ్డి(1985) టీడీపీ నుంచి పోటీచేసి గెలుపొందడమే కాకుండా ఆయా ప్రభుత్వాల్లో మంత్రులుగా పనిచేశారు. ఆ తర్వాత 1994 నుంచి 2004 వరకు టీడీపీ నుంచి వరుసగా మూడుసార్లు తూళ్ల దేవేందర్‌గౌడ్ గెలుపొందారు. ఆయన హోం, రెవెన్యూశాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుత కార్మికశాఖ మంత్రిగా కొనసాగుతున్న మల్లారెడ్డి సైతం మేడ్చల్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు.

### చేవెళ్ల నియోజకవర్గం..

చేవెళ్ల నియోజకవర్గానికి 1962 నుంచి ఇప్పటివరకు 14సార్లు ఎన్నికలు నిర్వహించగా తొమ్మిది మంది ఎమ్మెల్యేలుగా పనిచేశారు. వీరిలో 1985 నుంచి వరుసగా నాలుగు సార్లు (టీడీపీ నుంచి మూడు, కాంగ్రెస్ నుంచి ఒకసారి) గెలుపొందిన పి.ఇంద్రారెడ్డి ఉమ్మడి ఏపీలోని ఎన్టీఆర్ కేబినెట్‌లో హోంశాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన అకాల మరణం తర్వాత ఆ స్థానానికి (2000) నిర్వహించిన ఉపఎన్నికల్లో ఆయన సతీమణి సబితారెడ్డి గెలుపొందారు. ఆమె 2004లో కాంగ్రెస్ నుంచి మళ్లీ విజయం సాధించి తొలి మహిళా హోంమంత్రి(దేశంలోనే తొలి మహిళా హోంమంత్రి)గా పనిచేశారు. దంపతులిద్దరూ ఒకే నియోజకవర్గం నుంచి గెలుపొందమే కాకుండా ఒకే శాఖకు మంత్రిగా పనిచేయడం విశేషం. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా మహేశ్వరం నియోజకవర్గం నుంచి గెలుపొందిన సబితారెడ్డి గనులు భూగర్భవనరుల శాఖ మంత్రిగా పనిచేశారు.2018లో అదేస్థానంలో కాంగ్రెస్ అభ్య ర్థిగా విజయం సాధించి.. ఆ తర్వాత అధికార బీఆర్ఎస్‌లో చేరి విద్యాశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి కాలె యాదయ్య(బీఆర్ఎస్) ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

### షాద్‌నగర్ నియోజకవర్గం..

షాద్‌నగర్ నియోజకవర్గానికి ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు నిర్వహించగా.. 11 మంది ఎమ్మెల్యేలుగా పనిచేశారు. 1952లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా, కేరళ గవర్నర్‌గా పనిచేశారు. ఇక్కడి నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ పి.శంకర్‌రావు గతంలో కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు. అలాగే 2009లో కంటోన్మెంట్ నుంచిగెలుపొంది కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు.

### ఇబ్రహీంపట్నం నియోజకవర్గం..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు నిర్వహించగా.. 11 మంది ఎమ్మెల్యేలుగా పనిచేశారు. 1957 నుంచి 67 వరకు కొనసాగిన ఎంఎన్ లక్ష్మీనర్సయ్య సహా 1978లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన సుమిత్రాదేవి, 1999లో టీడీపీ నుంచి గెలుపొందిన కొండ్రు పుష్పలీల మంత్రులుగా పనిచేశారు. ప్రస్తుతం మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

### వికారాబాద్, తాండూర్‌లో..

వికారాబాద్‌లో ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు నిర్వహించగా ఎనిమిది మంది ఎమ్మెల్యేగా పనిచేశారు. చంద్రశేఖర్ కొంతకాలం చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేయగా, గడ్డం ప్రసాద్ కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గంలో పనిచేశారు. ఇక్కడ నుంచి గెలుపొందిన రామస్వామి కూడా మంత్రిగా పనిచేశారు. ఉమ్మడి ఏపీ సీఎంగా పనిచేసిన మర్రిచెన్నారెడ్డి కూడా ఇదే నియోజకవర్గం నుంచి రెండుసార్లు గెలుపొందారు. తాండూరుకి ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు నిర్వహించగా.. ఏడుగురు ఎమ్మెల్యేలుగా పనిచేశారు. వీరిలో మాణిక్యరావు, మర్రి చెన్నారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి మంత్రులుగా పనిచేశారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి పైలెట్ రోహిత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

### తొలి మహిళా హోంమంత్రిగా..

అలాగే చేవెళ్ల నుంచి గెలుపొందిన పటోళ్ల ఇంద్రారెడ్డి, సబితారెడ్డి దంపతులిద్దరూ ఉమ్మడి ఏపీలో హోంమంత్రులుగా పనిచేశారు. అయితే దివంగత నేత, మాజీ సీఎం డా.వైఎస్సార్ క్యాబినేట్‌లో దేశంలోనే తొలి మహిళా హోంమంత్రిగా సబితారెడ్డి రికార్డులకెక్కారు. ఇదే జిల్లాకు చెందిన తూళ్ల దేవేందర్‌గౌడ్ సైతం ఉమ్మడి ఏపీలో హోంమంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం మహేశ్వరం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న సబితారెడ్డి విద్యాశాఖ మంత్రిగా, మేడ్చల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న చామకూర మల్లారెడ్డి కార్మికశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 17 నియోజకవర్గాలు ఉండగా.. వీటిలో 10 స్థానాల్లోని అభ్యర్థులకు ఇప్పటివరకు ఆయా మంత్రివర్గాల్లో అవకాశం లభించింది. అయితే రాజేంద్రనగర్, ఎల్బీనగర్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేర్‌లింగంపల్లి, మల్కాజ్‌గిరి నియోజకవర్గాలకు ఇప్పటి వరకు ఏ మంత్రివర్గంలోనూ చోటు లభించకపోవడం గమనార్హం.

### కల్వకుర్తి నియోజకవర్గం..

కల్వకుర్తి నియోజకవర్గానికి ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు నిర్వహించగా 11 మంది ఎమ్మెల్యేలుగా పనిచేశారు. కేంద్ర మాజీ మంత్రి, దివంగత సూదిని జైపాల్‌రెడ్డికి రాజకీయ భిక్ష పెట్టింది ఈ నియోజకవర్గమే. 1969, 1972లో కాంగ్రెస్ నుంచి, 1978,1983లో జనతా పార్టీ నుంచి జైపాల్‌రెడ్డి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. మహబూబ్‌నగర్ నుంచి రెండుసార్లు, మిర్యాలగూడ నుంచి రెండు సార్లు ఎంపీగా గెలుపొంది కేంద్రమంత్రిగా పనిచేశారు. టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్.. 1989లో ఇక్కడి నుంచి ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఎన్టీఆర్‌ను ఓడించిన చిత్తరంజన్‌దాస్‌కు చెన్నారెడ్డి మంత్రివర్గంలో చోటు లభించింది. ప్రస్తుతం కల్వకుర్తి నుంచి జైపాల్‌యాదవ్(బీఆర్ఎస్) ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

# కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న థారాసింగ్‌జాదవ్

పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్‌జాదవ్

తాండూరు: కాంగ్రెస్‌కి తాండూరు నుంచి బలమైన అభ్యర్థి ఎవరు లేరనే ఉద్దేశంతో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్‌ను బరిలో ఉంచామని పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్ జాదవ్ అన్నారు. బుధవారం తాండూరు మండలం అంతారం శివారులో పెద్దేముల్ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా కాంగ్రెస్ అధికారంలో లేకున్నా తాండూరు నియోజవకర్గంలో అధికార పార్టీతో కొట్లాడామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ గెలుపునకు తీవ్రంగా శ్రమించామన్నారు. అయితే ఎమ్మెల్యేగా గెలిచిన అభ్యర్థి పార్టీ మారారన్నారు. కానీ రమేశ్ మహరాజ్ సారథ్యంలో పార్టీని తిరిగి నిలబెట్టామన్నారు. రమేశ్ మహరాజ్ అనారోగ్యం కారణంగా పోటిలో నుంచి తప్పుకున్నారని, దీంతో అసెంబ్లీ అభ్యర్థిగా బలమైన నేతను రంగంలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ ఎన్నికలకు పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న కేఎల్ఆర్‌ను తాండూరు నుంచి పోటీ చేయించాలని ఆయనను ఒప్పించి తీసుకొచ్చామన్నారు. గ్రామాల్లో ప్రజల అభిష్టం మేరకే కేఎల్ఆర్‌ను దించామన్నారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్‌కు హామీ ఇచ్చినందు వల్లే తాము మనోహర్‌రెడ్డి వెంట వెళ్లలేదన్నారు. టికెట్ ఎవరికి వచ్చిన తాము కాంగ్రెస్ కోసం పని చేస్తామన్నారు.

# ముడుపులతో గాలం!

- తాండూరు కాంగ్రెస్‌లో తాయిలాల పర్వం
- బీఆర్ఎస్ నుంచి వస్తున్న వారికి భారీ నజరానాలు
- సీనియర్లను పలకరించని వలస నేతలు
- టికెట్ ప్రకటించకముందే హస్తంలో చీలికలు

తాండూరు: తాండూరు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులే టార్గెట్‌గా కాంగ్రెస్ పార్టీ గాలం వేస్తోంది. వచ్చే ఏడాది వీరి పదవీ కాలం ముగియనుండటంతో అందిన కాడికి పుచ్చుకుని.. సర్దుకునేందుకు కొంతమంది సిద్ధమవుతున్నారు. వారివారి అర్హత, ప్రజాదరణ ఆధారంగా ప్యాకేజీలు అందించేందుకు హస్తం నేతలు మంతనాలు చేస్తున్నారు. విజయం సాధించిన తర్వాత పార్టీ పదవులతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అవకాశం కల్పిస్తామని చెబుతున్నారు. దీంతో వారం రోజుల వ్యవధిలోనే మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వర్గీయులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి భారీ నజరానాలు అందజేసి సంతోష పరుస్తున్నారని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. గ్రామ స్థాయి నాయకుడికి రూ.2 లక్షలు, మండల స్థాయి నాయకుడికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ముట్టజెబుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు నియోజవకర్గ స్థాయి నేతలకు రూ.50 లక్షల నుంచి రూ.కోట్లలో ఇచ్చేందుకు ఒప్పందాలు చేసుకుంటున్నారని టాక్ నడుస్తోంది.

**కాంగ్రెస్ శ్రేణులకు మొండి చేయి..**

తాండూరు నియోజకవర్గంలో పార్టీ ఓడినా, గెలిచినా కొంతమంది నేతలు కండువా మార్చకుండా సేవలందిస్తున్నారు. డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో రాజకీయాలు మారిపోయాయని కొంతమంది సొంత పార్టీ నేతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సదరు నేత సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వకుండా.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో లబ్ధిపొందిన నాయకులకే ప్యాకేజీలు ఇస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని బీఆర్ఎస్‌కు బీటీమ్‌గా మారుస్తున్నారని మండిపడుతున్నారు.

**వలస నేతలదే హవా..!**

తాండూరు కాంగ్రెస్‌లో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయని సీనియర్లు చెబుతున్నారు. దశాబ్దాలుగా పార్టీలో కొనసాగుతున్న వారిని పట్టించుకోకుండా వలస నేతలు వింతగా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో వారం రోజులుగా తాండూరు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పోటీ పడుతూ కాంగ్రెస్ కండువాలు ధరిస్తున్నారు. తాండూరు అసెంబ్లీకి కాంగ్రెస్ టికెట్ రేసులో ఉన్న డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి గత నెలలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సైతం టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే మనోహర్‌రెడ్డికి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆశీస్సులు మెండుగా ఉండటంతో టికెట్ తనకే వస్తుందనే ధీమాతో ఉన్నారు. దీంతో తాండూరు నియోజకవర్గంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులను, ముఖ్య నాయకులను మనోహర్‌రెడ్డి హస్తం గూటికి తీసుకొస్తుండటం గమనార్హం.


కాంగ్రెస్ జెండా

# మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం

- ఎమ్మెల్యే మెతుకు ఆనంద్
- రెండో విడత గొర్రెల పంపిణీ జరగలేదని లబ్ధిదారుల నిలదీత


ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఆనంద్

బంట్వారం: రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారమని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆయన బంట్వారం మండలంలో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కేసీఆర్ మూడో సారి సీఎం కావడం ఖాయమన్నారు. తనను మరో సారి ఆదరించి ఎన్నికల్లో గెలిపించాలంటూ ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నియోజక వర్గం అభివృద్ధే తన ధ్యేయమన్నారు. డీడీలు కట్టినా రెండో విడత గొర్రెల పంపిణీ జరుగ లేదంటూ రొంపల్లిలో పలువురు గొల్ల, కురుమలు ఎమ్మెల్యేను నిలదీశారు. బంట్వారంలో బీసీ బంధుకు సంబంధించి ఓ కుటుంబం ఎమ్మెల్యేను అడ్డగించి ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రభుత్వ పథకాలకు బ్రేక్ పడిందని, మళ్లీ తామే అధికారంలోకి వస్తామని అర్హులందరికి మంజూరు చేస్తామంటూ ఎమ్మెల్యే వారిని సముదాయించారు.

### దసరా ఉత్సవాల్లో గొడవ

#### ఇరువర్గాలపై కేసు నమోదు

నవాబుపేట: పాత కక్షలు మనుసులో పెట్టుకొని దసరా ఉత్సవాల్లో గొడవకు దిగిన సంఘటన దాతాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దాతాపూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ మాలీస్ బల్వంత్‌రెడ్డి, చిట్టిగిద్ద బాల్‌రెడ్డి వర్గీయులకు పాత కక్షలు ఉన్నాయి. వాటిని దృష్టిలో పెట్టుకొని దసరా ఉత్సవాల్లో జమ్మి తీసుకునే క్రమంలో ఇరువర్గాల వారు గొడవకు దిగారు. మాట మాట పెరిగి ఒకరిపై ఒకరు చేతులు వేసుకున్నారు, తోసుకున్నారు. అనంతరం ఇరువర్గాల వారు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఎస్ఐ భరత్‌భూషణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### బీజేపీతోనే అభివృద్ధి

#### కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి

మాడ్గుల: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆపార్టీ కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి తల్లోజు ఆచారి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన మాడ్గులలో బైక్‌ర్యాలీ, ఇంటింటి ప్రచారం నిర్వాహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ బీజేపీని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న బీఆర్ఎస్, దేశాన్ని నట్టేట ముంచిన కాంగ్రెస్‌లకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. అనంతరం మండల పరిధిలోని కొర్ర తండా, కట్రావత్ తండా గ్రామ పంచాయతీకి చెందిన దాదాపు 100 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు వేంకటేష్, ఎస్సీ మోర్చా నాయకులు జగన్, సర్పంచ్ నిరంజన్, తాలుకా కోకన్వీనర్ గోరెటి నర్సింహా, ఉప సర్పంచ్ శ్రీశైలం పాల్గొన్నారు.

# ప్రచారం షురూ!

బొంరాస్‌పేట: నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం షురు అయ్యాయి. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ప్రతిపక్షం నుంచి మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి మండల పరిధిలోని బురాన్‌పూర్ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో మండలంలో ఇరు పార్టీల ప్రచారం జోరందుకుంది. ఎన్నికల మెనిఫెస్టోను ఓటర్లకు వివరిస్తూ ముందుకెళ్తున్నారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఇరు పార్టీల నాయకులు ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. గురునాథరెడ్డి తన క్యాడర్‌తో కలిసి ఓటర్లను కలుస్తున్నారు. మండల పరిధిలోని మూడుమామిళ్ల తండాలో పార్టీ నేత జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో 100మంది చేరారు. కాంగ్రెస్‌కి ఓటేసి రేవంత్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఈ ప్రచారంలో జయకృష్ణ, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ నుంచి..**

చౌదర్‌పల్లి, రేగడిమైలారం తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు మాజీ వైస్ఎంపీపీ శేరి నారాయణరెడ్డి తదితరులు ప్రచారం చేశారు. బురాన్‌పూర్, కొత్తూరు తదితర గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. దేశ్యానాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, ఆయా గ్రామాల పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### స్కూటీని ఢీకొట్టిన బస్సు

#### విద్యార్థినికి గాయాలు


చికిత్స పొందుతున్న విద్యార్థిని

మోమిన్‌పేట: స్కూటీని బస్సు ఢీ కొట్టడంతో విద్యార్థినికి గాయాలైన సంఘటన మోమిన్‌పేటలో బుధవారం సాయంత్రం చోటు చేసుకొంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాస్లాబాదు గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి కూతురు క్రుషిత తన స్కూటీపై కాస్లాబాదు నుంచి మోమిన్‌పేటకు వెళ్తున్న క్రమంలో మోమిన్‌పేట నుంచి సంగారెడ్డి వస్తున్న ఆర్టీసీ బస్సును చూసిన కంగారులో బూర్గుపల్లి వైపు మలిపింది. ఆ సమయంలో బస్సు స్కూటీని ఢీకొంది. ఈ ఘటనలో ఆమెకు తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని క్రుషిత మోమిన్‌పేటలోని వింటేజ్ ప్రయివేటు పాఠశాలలో పదోతరగతి చదువుతుంది.

# సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల పరిశీలన


కేరెళ్లి పాఠశాలను పరిశీలిస్తున్న డీఎస్పీ నర్సింహులు

ధారూరు: ధారూరు మండల పరిధిలోని ధారూరు, కేరెళ్లి, నాగారం తదితర సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను బుధవారం వికారాబాద్ డీఎస్పీ కె.నర్సింహులు, ధారూరు సర్కిల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ సంతోష్‌కుమార్‌లు పరిశీలించారు. ఈ పోలింగ్ స్టేషన్లలో చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన చర్చించారు. పోలింగ్ స్టేషన్లకు 100 మీటర్ల దూరంలో వేయాల్సిన సున్నపు లైనింగ్, ఎక్కడెక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి, ఇతర లోటుపాట్లు పరిశీలించిన ఆయన సీఐ, ఎస్ఐలకు తగిన సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్యన కాగ్నానది పక్కనే నెలకొన్న మెథడిస్టు క్రిస్టియన్ జాతర ఏర్పాట్లపై ఆయన ఆరాతీశారు. జాతర ప్రాంగణానికి వెళ్లిన ఆయన పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నవంబర్ 14వ తేదీ నుంచి 19వ వరకు జరిగే మెథడిస్టు జాతర ఉత్సవాల సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై అక్కడే ఉన్న పాస్టర్లతో మాట్లాడారు. రాకపోకలకు ఇబ్బంది మారే కాగ్నా నదిపై నిర్మిస్తున్న అసంపూర్తి వంతెన నిర్మాణ విషయమై చర్చించారు. జాతరకు వచ్చే యాత్రికులు ఎంతమంది, వారికి సరిపడ ఏర్పాట్లు నిర్వాహకులు చేస్తారా? పోలీస్ బంబోబస్తు ఏమేరకు అవసరం వంటి విషయాలపై వారు చర్చించారు.

# గ్రామకంఠం భూమిలో నిర్మాణాలు


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామకంఠం భూమిని కబ్జాచేసి ప్రీకాస్టుతో గదులు నిర్మిస్తుండగా అధికారులు అడ్డుకుని వాటిని నేలమట్టం చేశారు. వివరాలు.. ఆదిబట్ల మున్సిపాలిటీ ఎంపీపటేల్‌గూడ రెవెన్యూ పరిధిలో డబుల్‌బెడ్రూం ఇళ్ల పక్కన ఉన్న గ్రామకంఠం భూమిలో నగరానికి చెందిన కొందరు వచ్చి ఈ భూమి మాది అంటూ ప్రీకాస్టు గోడలు పెడుతున్నారు. మున్సిపాలిటీకి చెందిన స్థానికులు ఈ విషయమై స్థానిక కమిషనర్, ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు గ్రామకంఠం భూమిలో అక్రమంగా నిర్మించిన గోడలను కూల్చివేశారు. అయితే ఇందులో ఎకరా 10 గుంటల భూమి తమదేనంటూ అక్రమార్కులు వాదించగా.. అధికారులు చెప్పిన సమాధానంతో చేసేదిలేక అక్కడి నుంచి వెళ్లిపోయారు.